# భారతము-
# రాజనీతి విశేషాలు

రచయిత్రి :

డా॥ సంధ్యావందనం గోదావరిబాయి

ఎందఱు ప్రజా ప్రతినిధి - ముఖ్యులు ప్రజల కొఱకై ప్రజల రాజ్యమునేలి ప్రజల మనస్సును చూఱఁగొన గలుగు చున్నారు.

అది పేరునకు రాజరికము కావచ్చును ప్రజల కొఱకే ఆ రాజులు తమ శక్తులను (ప్రభు, మంత్ర, ఉత్సాహ) బండారమును వెచ్చించెడి వారు! ప్రజల మనస్సును సంపూర్ణముగా ఆకర్షించెడి వారు ఆరాజులు ధన్యులు! ఆ ప్రజ ధన్యమైనది.

ఈ విషయమున సంస్కృత భారతము నించుక పరిశీలింతము.

ధర్మరాజును యువరాజుగా చేయగోరి ధృతరాష్ట్రుఁడు ప్రజల కోర్కెలను గూడ మనమునందుంచు కొనెను

ధర్మరాజు ప్రజల రంజింపఁజేయు చున్నాఁడనియే యువరాజును గావించెను.

'ధృతి స్థైర్య సహిష్ణుత్వా దానృశంస్యాత్త థార్జవాత్ భృత్యా నామను కంపార్థం'

ధృతి, స్థైరములు - సహిష్ణుత్వము - సాధుత్వము ఆర్జవము భృత్యుల అనుకరింప కొఱకు-

నన్నయ ధృతరాష్ట్రుఁడు యుధిష్ఠిరుని రాజ్య భార దురంధరునిగా గుర్తించినాఁడు భీష్మ విదురులతో నాలోచించి యౌవ రాజ్యాభిషిక్తునిఁ గావించెను.

నన్నయ కాలమున - యువరాజును చేయుటకు ప్రజాభిప్రాయ మక్కఱ లేదు.

సంస్కృత భారతము వ్రాయఁబడిన దినములలో ప్రజల యధి కారమును గుర్తెంగి - చతుష్పథములందును తమ అభిప్రాయమును నిస్సందేహముగా వెలి బుచ్చుచుండిరి,

రాజులను చేయుటకు, వారిని సింహాసన భ్రష్టులను గావించుటకు వారి కధీకారము కలదు.

పాండురాజు మరణించినాడు. ధృతరాష్ట్రుడు—తన కుమారుఁడైన దుర్యోధనుని కాదని యుధిష్ఠిరుని రాజుగా చెయఁగోరుచున్నాఁడు.

వ్యాస భార. ఆది. జతుగృహ

"గుణై స్సముదితాన్ దృష్ట్వా పౌరాః పాండుసుతాంస్తథా
కథయాం చక్రిరే తేషాం గుణాన్ సంసత్సు భారత
రాజ్య ప్రాప్తించ సంప్రాప్తం జ్యేష్ఠం పాండు సుతం తథా
కథయంతిస్మ సంభూయ చత్వరేషు సభాసు చ
తే వయం పాండవ జ్యేష్ఠ తరుణం యుద్ధశీలనమ్
అభిషిక్ష్యామ సాధ్వద్య సత్య కారుణ్య వేదినమ్"

చత్వరములందు సభలందు పౌరులు పాండుసుతుల గుణగణములను పొగడుచుండిరి. కనుక ధృతరాష్ట్రుఁడు పాండవ జ్యేష్ఠుని యువరాజునుఁగావింప నిశ్చయించినాఁడు.

మూలములో ఇంత విస్పష్టముగా నున్నను — నన్నయ పౌర సభలను గూర్చి ఏమియును చెప్పడు. ఆ సభలెటువంటివో ప్రజలకును తెలియవేమో!

నన్నయనాఁటి ప్రజలు — రాజుల సింహాసనము నెక్కించుట పదభ్రష్టులను చేయుట తమ అధికారముగా భావింపలేదు.

పౌరానురాగములేని రాజ్యము సాగదని తెలిసి యేదుర్యోధనుఁడు లోలోపల ప్రజలను తిట్టుచు దానములచేతను సన్మానములచేతను — ప్రకృతి జనముల సంతోష పెట్టుచుండువాఁడు.

వ్యాస భా ఆది. జ. 4 శ్లో॥

"శ్రుత్వా తాని వాక్యాని—

యుధిష్ఠిరాను రక్తానాం పర్యత్ర ప్యత దుర్మతిః"

"పౌరాను రాగ సంతప్తః" అని సంస్కృత భారతము. 9శ్లో

రాజులను ప్రతిష్ఠించుచుండిరి. తీసివేయుచుండిరి. అంతటి శక్తి గలవారు కనుకనే – ఆ కాలపు ప్రజలు రాజులను తీవ్రముగ విమర్శించుచుండిరి.

ఏకచక్రపుర నివాసియగు నొక పేద బ్రాహ్మణుఁడు బకాసురునకు ఆహారము పంపుటకు తనవంతు వచ్చినపుడు శోకించుచు రాజును నిందించును.

"ఉపాయం తం నకురుతే యత్నాదపి నమందధీః" అని ఆ రాజును మందబుద్ధిగా ఉపాయమును కూడ ఆలోచింపని వానిగా నిందించు చున్నాఁడు.

"ఏతదర్థా వయం నూనం వసామో దుర్బలస్యయే" అని "రాజానాం ప్రథమం విందేత" అని దుర్బలుఁడగు రాజు పాలనమున బ్రదుకు చున్నారమని, రాజును మొదట తెలిసికొన్నచో ప్రజా పాలన మర్థమయి పోవునని నిందించుచున్నాఁడు.

ఇట్లు అసమర్థుఁడగు రాజు రాజ్య పాలనమున ప్రజలు తమకు కీడు కలిగినపుఁడు రాజును నిందించుచున్నారు

మఱొక ఘట్టము—

ధృతరాష్ట్రుని నియోగమున పాండవులు జననీ సహితులై వారణావతమునకు పోవసమకట్టినారు. రథములధిష్ఠించిరి. ధనుర్ధారులయి హస్తిపురమునుండి వెడలు చుండిరి.